## క్లుప్తంగా

### కుమార సుబ్రహ్మణేశ్వరస్వామికి అభిషేకాలు


బిక్కవోలులో కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: కుమార సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద అభిషేకాలు మంగళవారం నిర్వహించారు. మంగళవారం పాల్గుణ మాసం చవితి కావడంతో భారీ ఎత్తున భక్తులు స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### రేపు వాహనాల వేలం


బిక్కవోలు పోలీసుస్టేషన్ వద్ద ఉన్న వాహనాలు

బిక్కవోలు: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం ద్వారా విక్రయించనున్నట్టు బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ సమక్షంలో 19 బైకులు, 2 ఆటోలు, కారుకు సంబంధించి బిక్కవోలు పోలీసుస్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిక్కవోలు: బలభద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో కొత్తగా అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బలభద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని బలభద్రపురం, కాపవరం, గంగులూరు పాకల గ్రామాలు, వ్యవసాయ, ఇండస్ట్రియల్ సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. దీనిపై వినియోగదారులు సహకరించాలని అన్నారు.

### 'నన్నయ' క్యాంపస్‌లోని కళాశాలల పరిశీలన


క్యాంపస్‌లోని కళాశాలలను పరిశీలించిన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సైన్స్, ఇంజనీరింగ్ కళాశాలలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం సందర్శించి, అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్స్ రూమ్‌లో ఉన్న హాజరు పట్టీలను పరిశీలించి, అధ్యాపకులంతా సమయానికి రావాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయనిర్మల వీసీకి వివరించారు. భవనాల కొరత కారణంగా కొన్ని తరగతులను షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించాల్సి వస్తోందన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.

### స్వాతంత్ర్య సమర యోధులు స్ఫూర్తి ప్రదాతలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజానగరం: స్వాతంత్ర్య సమరయోధులు నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఈనెల 23న భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించిన పోస్టర్లను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం విడుదల చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి ఆరోజు సభలు, సదస్సులు, కాగడాల ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించడం ద్వారా ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు కె. భానుప్రసాద్, నగర కార్యదర్శి దినేష్, నాయకులు మణికంఠ సంతోష్, వంశీ, అప్పారావురెడ్డి, సోముశేఖర్‌రెడ్డి, బాలుదొర, చంద్రశేఖర్‌రెడ్డి, రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు ప్రయాణం.. మరింత దూరం

- ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేరేనా?
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు
- చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని పలువురి ఆవేదన




పెదపూడి: హామీలు ఇచ్చి ప్రజలను ప్రలోభపెట్టడం..అధికారంలోకి వచ్చాక ఆ హామీలతో తనకేంటి సంబంధం అన్నట్టుగా వాటిని అటకెక్కించడం నారా చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య. 2014లో ఎన్నికల సమయంలో ఆయన సుమారు 600 పైగా హామీలిచ్చి మోసం చేశారు. మళ్లీ 2024లో సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణమని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నప్పటికీ ఉచిత బస్సు తుస్సు అని తేల్చేశారు. తాము మరోసారి మోసపోయామని మహిళలు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నికలు హామీల్లో భాగంగా చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి, దీపం పథకం (ఉచిత గ్యాస్ సిలిండర్లు), తల్లికి వందనం వంటి పథకాలను చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి సుమారు 10 నెలలు గడిచిపోయినా ఈ పథకాల్లో ఒక్కటీ అమలు చేయలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించామని చెప్పుకోడానికి తప్ప క్షేత్రస్థాయిలో అమలులో ఉందో లేదో పాలకులకే తెలియాలి. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–2026 వార్షిక బడ్జెట్లో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు పూర్తిగా మొండి చేయి చూపింది. ఉచిత బస్సు ప్రయాణం పథకానికి రూపాయి కూడా కేటాయించకుండా ఈ పథకం అమలుపై నిర్లక్ష్యం వహించారు. దీంతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న కూటమి నేతల హామీ తుస్సయిందంటూ మహిళలు ఎద్దేవా చేస్తున్నారు.

**నియోజకవర్గంలో మహిళా ఓటర్ల వివరాలు**

| మండలం | మహిళా ఓటర్లు |
|---|---|
| అనపర్తి | 30,630 |
| బిక్కవోలు | 29,510 |
| రంగంపేట | 23,714 |
| అనపరి | 29,866 |
| మొత్తం | 13,780 |

**ఉచిత బస్సు ప్రయాణం ప్రకటనకే పరిమితం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇదిగో ప్రారంభించేస్తామంటూ నాయకులు మీడియా ద్వారా తరచూ ప్రకటిస్తున్నారు. ఒక్కో మంత్రి ఒక్కో తేదీని ప్రకటించేశారు. ఒకరు 2024 ఆగస్టు 15న ప్రారంభించేస్తామని చెబితే, మరొకొందరు మంత్రులు దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మారుస్తూ వచ్చారు.

**మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో తాత్సారం**

ఆఖరికి ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. రవాణా శాఖ మంత్రి చైర్మన్‌గా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, హోంమంత్రి సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటైంది. వీరు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ కమిటీ అధ్యయనం చేసిందో లేదో ఎవరికీ తెలియదు, నివేదిక ఇచ్చిందో లేదో కూడా బహిర్గతం కాలేదు. ఇప్పటి వరకు ఆ పథకంపై ఏలాంటి నివేదిక సమాచారాన్ని ప్రభుత్వం ప్రకటించలేదంటూ మహిళలు ఆందోళన చెందుతున్నారు.

**ఇంకెప్పుడు అమలు చేస్తారు?**



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఈ పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలివ్వడం, తర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు. ఏ పథకానికి ఇంత ఖర్చు అవుతుందన్న సంగతి ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

– ఇమ్మంది విజయకుమారి, వైఎస్సార్‌సీపీ అనపర్తి నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు

**అనపర్తి నియోజకవర్గంలో 1,13,780 మంది మహిళా ఓటర్లు**

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో సుమారు 1,13,780 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

## విద్యుత్ ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సత్యనారాయణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న యువసేన ప్రతినిధులు

పెదపూడి: పద్మశాలీలకు సంఘం తరపున అండగా ఉంటామని రాష్ట్ర పద్మశాలీ యువసేన ప్రతినిధి పెనుగొండ శ్రీనివాసరావు అన్నారు. ఆయన అనపర్తిలో మంగళవారం మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గం ఏడిదలో యూవీవీ సత్యనారాయణ 15 రోజుల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతన్ని శ్రీనివాసరావు, ఇతర పద్మశాలీ యువసేన నాయకులు పరామర్శించి దాతల నుంచి సేకరించిన సుమారు రూ.22,500 అందజేశారు. ఈ సందర్భంగా పెనుగొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పద్మశాలీ కులస్తులకు విద్యా, ఆర్థికపరంగా సహాయం చేయడానికి యువసేన ద్వారా సహాయనిధి ఏర్పాటు చేసి నిధులు సేకరిస్తున్నామన్నారు. యువసేన సేవలు అభినందనీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ యువసేన రాష్ట్ర ప్రతినిధి బొడ్డు శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రతినిధి పథం ఆనంద్, తంగెళ్ల రాజు, ఇమ్మంది శ్రీను పాల్గొన్నారు.

## సూర్యనారాయణరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు


మృతుడు ద్వారంపూడి సూర్య నారాయణరెడ్డి (ఫైల్)

పెదపూడి: వైఎస్సార్ సీపీ జి.మామిడాడ గ్రామ కన్వీనర్, ముఖ్య అనుచరుడు ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి (చిన్న హంస) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలో మంగళవారం ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి (47) ఆకస్మికంగా మృతి చెందారు. సూర్యనారాయణరెడ్డి భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు సందర్శించారు. పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని భార్య, తల్లిదండ్రులను మాజీ ఎమ్మెల్యే దంపతులు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యనారాయణరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చాలా చురుగ్గా పాల్గొని 2019 ఎన్నికల్లో విజయానికి తన వంతు కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి మృతి చెందడం చాలా దురదృష్టకరమన్నారు. ఆ కుటుంబానికి పార్టీ అంతా అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ లంక మున్ని, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, పెద్దాడ సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, నాయకులు సత్తి సుబ్బారెడ్డి, కర్రి శ్రీనివాసారెడ్డి, ద్వారంపూడి వెంకన్నబాబు, కడిమి శ్రీనివాస్, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి,, మండ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.


సూర్యనారాయణరెడ్డి భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

## సేవకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయం


కరకుదురులో వాటర్ ప్యూరిఫైయర్‌ను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న ట్రస్ట్ వైస్ చైర్మన్ త్రిమూర్తులు

పెదపూడి: గ్రామాభివృద్ధికి సహకరిస్తూ సామాజిక సేవలు విస్తరిస్తున్న సేవకీయం ట్రస్ట్ సేవలు అభినందనీయమని కరకుదురు సర్పంచ్ వుండ్రు చంద్రకళ అన్నారు. కరకుదురు గ్రామ పంచాయతీకి ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.25 వేల విలువగల వాటర్ ప్యూరిఫైయర్ మంగళవారం అందజేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో పాఠశాలలు, ఆలయాలు అభివృద్ధి, పేద విద్యార్థులకు ఆర్థికపరమైన సహకారం తమ ట్రస్ట్ ద్వారా అందజేస్తున్నామన్నారు. అనంతరం సచివాలయం కార్యదర్శి భోగరాజ ప్రసన్న ఆంజనేయులు, సర్పంచ్‌కు వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, వీఆర్వో భాగయ్య, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ట్రస్ట్ ప్రతినిధులు పాటంశెట్టి వెంకటేష్, నక్కా సిద్దు, అడపా శ్రీనివాసు, అడబాల సత్తిబాబు, ఆకుల బాలాజీ పాల్గొన్నారు.

## సాంకేతిక ఉత్సవంలో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజానగరం: జేఎన్‌టీయూకేలో ఇటీవల నిర్వహించిన సాంకేతిక ఉత్సవంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరచి, పలు బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ తెలిపారు. ఆటోమొబైల్ ఇంజనీరింగ్ చదువుతున్న చిన్నాల హరి, ఎన్.రుదేష్ ఇచ్చిన పరిశోధన పత్రానికి మొదటి బహుమతి లభించిందన్నారు. అలాగే కావ్యశ్రీ మానే, సాయిప్రవీణ, పంగా అయ్యప్ప, భానుప్రకాష్, మాధవి, మణిరత్నం, బెనర్జీ నాయుడు సమర్పించిన ప్రాజెక్టుకు పలువురి ప్రశంసలు దక్కాయన్నారు. రైతులు పొలాల్లో ముఖ్యంగా రాత్రి వేళలలో సంచరించే సమయంలో వారికి ఉపయోగపడే విధంగా వీరు సోలార్ విద్యుత్‌తో పని చేసే ఒక కర్రను తయారు చేశారన్నారు. ఈ కర్రను పట్టుకుని రైతు నడుస్తుంటే దాని నుంచి వచ్చే శబ్దాలు పాములు, కీటకాల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. అంధులకు కూడా ఇది ఉపయోగపడుతుందన్నారు. సోమనాథ్, రుతిక్‌రోషన్, తదితరులు సోలార్‌తో పని చేసే అతి చిన్న, సులువుగా మూసుకుపోయే విద్యుత్ వాహనాన్ని ఈ ఉత్సవంలో ప్రదర్శించి, బహుమతిని అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పలువురు అధ్యాపకులు అభినందించారు.

### అంగన్‌వాడీల్లో ఉద్యోగావకాశాలు

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని మూడు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి తెలిపారు. రాజానగరంలో పాలచర్ల–1, పాతతుంగపాడు–2, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ధవళేశ్వరం–16, పిడింగొయ్యి–3, కడియం మండలంలో వేమగిరి–4, కడియం–5 అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులు ఖాళీలున్నాయన్నారు. ఈ పోస్టులకు జూలై ఒకటి నాటికి 21 ఏళ్లు పూర్తయి, 35 సంవత్సరాల వయస్సులోపు ఉండి, 10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానిక వివాహితులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 29, సాయంత్రం 5 గంటలలోగా పూర్తి చేసిన దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

**అంగన్‌వాడీల్లో ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**

మధురపూడి/ సీతానగరం: కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 3 అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు, ప్రాజెక్టు అధికారి జె.జాన్సీరాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గతేడాది జులై 1వ తేదీ నాటికి 21 ఏళ్లు నిండి, 35 సంవత్సరాల్లోపు వయస్సు గలవారు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక అభ్యర్థినులు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి ద్వారా ధ్రువీకరణపత్రాన్ని దరఖాస్తుతో పొందుపర్చాలన్నారు. కోరుకొండ, సీతానగరం మండలాల్లో 3 ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వాటిలో గాదరాడ–2 సెంటర్‌కు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ, కోటి–2 ఓసీ (హెచ్‌హెచ్) సామాజికవర్గానికి, సీతానగరం మండలం మిర్తిపాడు–2 ఓసీ జనరల్‌కు కేటాయించినట్టు తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

రంగంపేట: పేకాట స్థావరంపై దాడి చేసి భారీ స్థాయిలో జూదరులను అరెస్టు చేసి, నగదు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు రంగంపేట ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండల పరిధిలోని జి.దొంతమూరు గ్రామ శివారు దుర్గమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్నట్టు అనపర్తి సీఐ సుమంత్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలసి దాడి చేసి పేకాడుతున్న 19 మంది జూదరులను అరెస్టు చేసి, 9 బైక్‌లను, రూ.1,09,300 స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అనంతరం రంగంపేట స్టేషన్‌కు అప్పగించడంతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## పాఠశాలకు కుర్చీల బహూకరణ


జి.మామిడాడలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటరెడ్డికి కుర్చీలు అందజేస్తున్న ఫణిశ్రీ

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జి.మామిడాడలో డీకేఆర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్తివెంకటరెడ్డి (ఎస్‌వీఆర్) అన్నారు. ఈ పాఠశాల్లో ఖండవిల్లి ఫణిశ్రీ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె తండ్రి దివంగత వాడపల్లి శేషావతారం తెలుగు ఉపాధ్యాయుడిగా పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. మంగళవారం ఆయన జ్ఞాపకార్థం రూ.25 వేల విలువగల 11 కుర్చీలు ఉపాధ్యాయుల సౌకర్యార్థం వెంకటరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు, ద్వారంపూడి సుబ్బారెడ్డి కొవ్వూరి రామిరెడ్డి, సత్తి త్రినాథ్ రెడ్డి, వల్లు రోషిణి పాల్గొన్నారు.

## రాజగోపురం నిర్మాణానికి రూ.7లక్షల విరాళం


జి.మామిడాడలో వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి ధర్మకర్తలకు విరాళాలు అందజేస్తున్న దాతలు

పెదపూడి: ఆలయాల అభివృద్ధికి దాతలు సహకారం మరువలేనిదని జి.మామిడాడ గ్రామం సూర్యనారాయణపురంలో ప్రసిద్ధి చెందిన ఆలివేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి మోహనరామగంగాధర్‌రెడ్డి అన్నారు. ఈ వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణం నిమిత్తం ధర్మకర్తలకు భక్తులు రూ.7లక్షల విరాళాలు మంగళవారం అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి అల్లుడు రాజానగరానికి చెందిన సత్తి శ్రీనివాసారెడ్డి మోహినివరలక్ష్మీ దంపతులు, వీరి కుమారులు భాస్కర్ సత్యనారాయణరెడ్డి, హిమజ, అర్జున్‌కృష్ణారెడ్డి, గోపి సురేందర్‌రెడ్డి రూ.5 లక్షలు, అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన కర్రి వెంకట్‌రెడ్డి సురేఖ దంపతులు రూ.లక్ష, జి.మామిడాడకు చెందిన పులగం సత్యనారాయణరెడ్డి పార్వతీ దంపతులు రూ.లక్ష విరాళాలు అందించారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు పద్మనాభ సత్యనారాయణరెడ్డి, మోహనరామగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి భక్తులు, దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఆరవిల్లి రఘురామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 'సత్యసాయి' ఉద్యోగుల సమ్మె విరమణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/ సీతానగరం : తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నట్లు సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రకటించారు. వారి సమస్యపై కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో చర్చలు జరిపారు. శ్రీ సత్యసాయి తాగునీటి పథకం ఉద్యోగుల సమస్యలపై నివేదిక సమర్పించామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. నెల జీతభత్యాల చెల్లింపునకు అవసరమైన రూ.10 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అనంతరం స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కట్టమూరి వీరబాబు, ఉందుర్తి ఇస్సాక్ విలేకర్లతో మాట్లాడారు. తమతో చర్చలు జరిపేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం అమరావతి ఆహ్వానించారని, ఈ నేపథ్యంలో సమ్మె విరమిస్తున్నామని చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ నుంచి తాగునీటిని విడుదల చేస్తామని యూనియన్ అధ్యక్షుడు వీరబాబు తెలిపారు. దీనితో దేవీపట్నం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రాజానగరం మండలాల పరిధిలోని గ్రామాలకు శుద్ధి చేసిన గోదావరి జలాలు సరఫరా చేస్తామని తెలిపారు.

## అయోడైజ్డ్ ఉప్పు వినియోగించాలి


కాటవరం ఎంపీయూపీ స్కూల్లో విద్యార్థులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

సీతానగరం: కాటవరంలో జాతీయ అయోడిన్ లోప కారక వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం కాటవరం ఎంపీయూపీ స్కూల్లో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య ఒకటో తరగతి నుంచి 6వ తరగతి విద్యార్థులు 90 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్, బుద్ధిమాంద్యం, శారీరక ఎదుగుదల లోపం వంటి లక్షణాలుంటాయని డాక్టర్ చైతన్య తెలిపారు. నలుగురు పిల్లలకు స్వల్పంగా గాయిటర్ అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించారు. ప్రతి ఒక్కరూ అయోడైజ్డ్ ఉప్పు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, హెచ్‌ఎమ్ టి.వెంకటలక్ష్మి, ఎమ్ఎల్‌హెచ్‌పీ ఎస్కే చాంద్ బీ, ఏఎన్ఎమ్ ఆర్ జ్యోతి, ఆశావర్కర్ టి.సంధ్యాలత పాల్గొన్నారు.

## 20 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు


కోరుకొండలో కోడినాగుల రాజబాబు నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

మధురపూడి: కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు జోరుగా నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వహణదారులకు అధిక ఆదాయం రావడంతో ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. కోరుకొండ పోలీసులు దీనిని అరికట్టడానికి దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం నార్త్‌జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్, జోన్ స్పెషల్ టీమ్‌తో కలసి దాడులు నిర్వహించి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బస్‌స్టాండ్ ఎదురుగా పాన్‌షాపు నిర్వహిస్తున్న కోడి నాగుల రాజబాబు దుకాణంలో 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4,400 ఉంటుంది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు జ్యూడీషియల్ రిమాండ్ విధించినట్టు తెలిపారు. కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

మధురపూడి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యం మెరుగవుతుందని వ్యవసాయశాఖ జేడీ మాధవరావు అన్నారు. మంగళవారం స్థానిక కాపవరంలోని ఆశాఖ కార్యాలయంలో వచ్చే ఖరీఫ్‌కు యాక్షన్ ప్లాన్ నిమిత్తం కోరుకొండ డివిజన్‌కు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్, డీఆర్‌డీఏ సెర్ప్ సంస్థల సమన్వయంతో నిర్వహించిన సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సమాజ వికాశానికి దోహదపడుతుందన్నారు. పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు ఉపయోగించే కషాయాల తయారీ, సహజ ఎరువులపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆ శాఖాధికారులు తాతారావు, వలీ, రాజశేఖర్, వెంకటరామయ్య, రామకృష్ణ, కోరుకొండ, సీతానగరం, మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.